సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 11 । మార్చి । 2024



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్, మంత్రి విడదల రజిని, లక్ష్మీపార్వతి, బాలినేని, మోపిదేవి, బీద మస్తాన్‌రావు తదితరులు





బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు పోటెత్తిన జనసందోహంలో ఓ భాగం (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జయ జయ జయహో..



మా నమ్మకం నువ్వే అన్నా: సిద్ధం పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న యువత



కెవ్వు కేక : సమరానికి సిద్ధమంటూ విజిలేస్తున్న మహిళ



ఓ అన్నా.. నీవెంటే మేమంటూ నినదిస్తున్న యువతి

సైన్యంలా...ఓ శాసనంలా
ఊళ్లన్నీ ఒక్కటిగా.. జనమంతా ఐక్యంగా
జన చేతన పొంగిన సంద్రంలా
కొత్త ఒరవడికి శ్రీకారంలా...
భూదేవి నుదుట దిద్దిన సిందూరంలా
మహోజ్వల ఘట్టానికి మలి మెట్టులా
సువర్ణ అధ్యాయానికి జన సంతకంలా
చరిత్ర పుటల్లో తమకంటూ ఓ పేజీలా
సమరోత్సాహంతో...సమధికోత్సాహంతో...
కదనరంగానికి దుమికినట్టు..
కార్యోన్ముఖులై కదిలినట్టు
జన సారథి వెంట జనవారధి కట్టినట్టు
రాజన్న బిడ్డ పాలన మళ్లీ రావాలంటూ
అభివృద్ధే లక్ష్యంగా.. సంక్షేమమే సాక్ష్యంగా
గడప గడప నుంచి.. పల్లె పల్లె నుంచి
జన సమూహాలు జన సందోహాలు
సిద్ధం సభకు తరలి వచ్చిన తీరు
మరో మహోద్యమాన్ని తలపించింది..
రేపటి భవితను సాక్షాత్కరించింది.

సిద్ధం సభ జన సంద్రం

- అన్నిదారులూ బాపట్ల జిల్లా మేదరమెట్ల వైపే..
- ఉదయం నుంచే సభాస్థలికి తరలివచ్చిన జనసందోహం
- లక్షలాదిగా కదిలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు
- జనసంద్రంగా మారిన సభా ప్రాంగణం
- వందలాది ఎకరాలతోపాటు స్తంభించిన జాతీయ రహదారి
- సీఎం వైఎస్ జగన్ ప్రసంగంతో ఆద్యంతం హోరెత్తిన జనస్పందన
- నిన్ను మళ్లీ గెలిపించుకునేందుకు సిద్ధం అంటూ నినదించిన జనం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం జరిగిన సిద్ధం సభ జనంతో పోటెత్తింది. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో నిర్వహించిన ఈ సభకు ఆయా జిల్లాలనుంచి జనం లక్షలాదిగా తరలివచ్చారు. మధ్యాహ్నం తరువాత సభ జరగాల్సి ఉన్నా ఉదయం 9 గంటలనుంచే జనం సభా ప్రారంభానికి చేరుకోవడం ప్రారంభమైంది. 11 గంటల ప్రాంతానికి మేదరమెట్ల సమీపంలోని జాతీయ రహదారివద్ద వందలాది ఎకరాల్లో సిద్ధం చేసిన సిద్ధం సభా ప్రాంగణం జనంతో నిండి పోయింది. సమీపంలోని పొలాలతోపాటు పక్కనే ఉన్న చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి సైతం సభకు వచ్చిన జనంతో కనుచూపుమేర జనసంద్రంగా మారింది. ఈ రహదారిలో మేదరమెట్ల నుంచి రేణంగివరం వరకు 18 కిలోమీటర్ల వరకు రోడ్డు జనంతో కిక్కిరిసి పోయింది. మరోవైపు మేదరమెట్ల నుంచి అద్దంకి వరకు (హైదరాబాద్) ప్రధాన రహదారి జనసంద్రంగా మారింది. పిల్లలు, యువత, మధ్యవయస్కులు, వృద్ధులు, మహిళలు అన్నతేడా లేకుండా అన్నివర్గాలవారు వైఎస్సార్ సీపీ జెండాలు చేబూని సభకు తరలివచ్చారు. రాష్ట్రం నలుమూలలకు వినిపించేలా జై జగన్ అన్న సభికుల నినాదాలు సభలో హోరెత్తించాయి.



ప్రజల మధ్యకు వచ్చి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

రెండు సార్లు బటన్ నొక్కేందుకు సిద్ధం..

58 నెలల్లో మీ బిడ్డ మీ కోసం 130 సార్లు బటన్‌నొక్కి రూ. 2.70 లక్షల కోట్లు మీ ఖాతాల్లో వేశానని, నా కోసం మీరు రెండు బటన్లు నొక్కలేరా అనగానే నొక్కుతాం...నొక్కుతాం అంటూ పెద్ద ఎత్తున ప్రతిధ్వనించారు. మీ బిడ్డకు ఓటేస్తే అన్ని పథకాలు అందుతాయని, బాబుకు ఓటేస్తే చంద్రముఖిని మనమే వెళ్లి నిద్రలేపి ఇంటికి తెచ్చుకున్నట్లేనని జగన్ అనడంతో అవును... అవును...అంటూ ప్రజలు స్పందించారు. 2019 మించి 175 కు 175 ఎమ్మెల్యేలు, 25 కు 25 ఎంపీలు గెలవడానికి మనమంతా సిద్ధమేనా అనగానే సిద్ధం..సిద్ధం అంటూ జనం హోరెత్తించారు. త్వరలోనే మేనిఫెస్టో ప్రకటిస్తానని, జగన్ మాట ఇచ్చాడంటే తగ్గేదేలే అంటూ అనగానే జనం ఈలలు, కేకలతో సభ దద్దరిల్లింది. మళ్లీ నిన్నే గెలిపించుకుంటామంటూ ప్రతిస్పందించారు. ప్రతిపక్షాలపై విమర్శలు బాణాలు సంధించినప్పుడు జనంలో ఉత్సాహంతో కూడిన ప్రతిస్పందన కనిపించింది. ఈ ఎన్నికల్లో వారి అంతు తేలుస్తామంటూ జనం ఆగ్రహంతో ఊగిపోయారు. కుట్రలు, కుతంత్రాలకు ముగింపు పలుకుతామంటూ నినదించారు. సభ ఆద్యంతం సీఎం...సీఎం అంటూ హోరెత్తించారు.ఈ సభలో మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, మేరుగ నాగార్జున, ఎంపీలు విజయసాయి రెడ్డి, మోపిదేవి వెంకటరమణారావు, కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు బాలినేని శ్రీనివాసరెడ్డి, కరణం బలరాం కృష్ణమూర్తి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కోన రఘుపతి, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, నియోజకవర్గ సమన్వయకర్తలు పానెం చిన హనిమిరెడ్డి, కరణం వెంకటేష్, యడం బాలాజీ, ఈవూరి గణేష్, వరికూటి అశోక్, వైవీ భద్రా రెడ్డి పాల్గొన్నారు.





ర్యాంపు వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



నేను సైతం..

అపూర్వ స్పందన..

సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు చేరుకున్నారు. తర్వాత సభావేదిక మీదకు చేరుకున్న ముఖ్యమంత్రి 4.47 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించి, 5.56 గంటలకు ప్రసంగాన్ని ముగించారు. ముఖ్యమంత్రి ప్రసంగం ఆద్యంతం సభికులను ఆకట్టుకుంది. ఆయన ప్రతిమాటా తూటాలా పేలింది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకోసం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ముఖ్యమంత్రి సూటిగా జనం ముందుంచారు. పథకాలతో జనానికి జరిగిన మేలును గణంకాల రూపంలో వివరించారు. ముఖ్యంగా పేదవర్గాల జీవన ప్రమాణాలు ఎలా మెరుగు పడ్డాయో తెలియ జెప్పారు. ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన నేత పవన్‌కల్యాణ్, రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న కుట్రలను ప్రజల ముందు బట్టబయలు చేశారు. ప్రతిపక్షాలపై జగన్ విరుచుకు పడటంతో జగన్ గొంతులో గొంతు కలిపి తమదైన శైలిలో మద్దతు పలికారు. మరో ఐదేళ్లు ఈ ప్రభుత్వం కొనసాగాలంటే మీరు మద్దతు పలికేందుకు సిద్ధమా.? అనడంతో సిద్ధం..సిద్ధం అంటూ జనం ఈలలు, కేకలతో స్పందించారు. 'జగన్ సీఎం...సీఎం' అంటూ నినాదాలు చేశారు. పేదవాడి భవిష్యత్తు కాపాడేందుకు నాతో కలిసి రావడానికి మీరు సిద్ధమా...? అని సీఎం అనగానే సిద్ధం అంటూ జనం ప్రతిస్పందించారు. పార్టీలతో బాబు....ప్రజలతో మనం ఈ సంగ్రామానికి జనం సిద్ధమా... అనగానే సిద్ధం ...సిద్ధం అంటూ హోరెత్తించారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర సిద్ధం..., ఉత్తర కోస్తా సిద్ధం, రాయలసీమ సిద్ధం... తాజాగా దక్షిణ కోస్తా సిద్ధం అంటూ జగన్ అనగానే సిద్ధం...సిద్ధం అంటూ ప్రజలు ప్రతిధ్వనించారు.

ఆయుధాలు ప్రయోగించాల్సిన సమయం ఆసన్నం..

ఈ యుద్ధంలో మీది శ్రీకృష్ణుడి పాత్ర, నాది అర్జునుడి పాత్ర, దుష్టులపై ఆయుధాలు ప్రయోగించాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకే జమ్మిచెట్టుపై నుంచి ఆయుధాలు దింపాల్సిన సమయం ఆసన్నమైందంటూ జగన్ భారతాన్ని ఉటంకించడంతో జనం కేరింతలు కొట్టారు. చంద్రబాబు లాగా మనకు 10 మంది నటించే పొలిటికల్ యాక్టర్లు లేరు....రకరకాల పార్టీలతో పొత్తులు లేవు. అందుకే ఒంటరిగానే ఎన్నికలకు వెళ్తున్నాను. మీ బిడ్డకు మీరే స్టార్ క్యాంపెయినర్లు. ప్రతిపక్ష పార్టీలో సైన్యాధిపతులు తప్ప సైన్యం లేదని 5 కోట్ల మంది సైన్యం అండదండలతో మనం సిద్ధం అని ముఖ్యమంత్రి అనగానే జనం ఈలలు, కేకలతో స్పందించారు. చంద్రబాబుకు దోచుకునేందుకు, దాచుకునేందుకే అధికారం కావాలని జగన్ అనడంతో జనం అవును...అవును అంటూ నినదించారు.





సిద్ధం సభకు తరలివచ్చిన పల్లె ప్రజానీకం



సిద్ధం సభ వద్ద యువత కేరింత

క్లుప్తంగా

13న ప్రధాని మోదీ వర్చువల్ సమావేశం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని ఎస్ఎస్ఎఫ్డీసీ లబ్ధిదారులతో ఈ నెల 13న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ సమావేశం నిర్వహించనున్నారని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కే రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. భారత ప్రభుత్వ న్యాయ మంత్రిత్వ శాఖ ద్వారా జిల్లాలోని ఐదు గ్రూపుల్లోని 25 మందికి రూ.31,67,326 విలువ కలిగిన వాహనాలను అందజేసినట్లు తెలిపారు. వాహన లబ్ధిదారులతో ప్రధాన మంత్రి వర్చువల్‌గా మాట్లాడుతారని చెప్పారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, స్త్రీనిధి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండండి

ఉదయగిరి: వేసవి దృష్ట్యా అటవీ సిబ్బంది అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాసులురెడ్డి సూచించారు. ఉదయగిరిలోని అటవీ శాఖ కార్యాలయంలో అడవుల సంరక్షణపై అటవీ సిబ్బందితో ఆదివారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అడవుల్లో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అడవులు అగ్నికి ఆహుతి కాకుండా ముందస్తుగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. తరచూ అగ్నిప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వన్యప్రాణులను వేటాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. జగనన్న భూహక్కు సర్వేలో భాగంగా రిజర్వ్ ఫారెస్ట్ సమీపంలోని భూములను సర్వే చేసే సమయంలో అటవీ భూములు ఆక్రమణకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో ప్లాంటేషన్లు, నర్సరీలను తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ మారుతీప్రసాద్, సబ్ డీఎఫ్ఓ రాజశేఖరబాబు, ఉదయగిరి రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి, డీఆర్వోలు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

- 7.50 సవర్ల బంగారు,
- 2.10 కేజీల వెండి అపహరణ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

ఇందుకూరుపేట: ఇంట్లో ఎవరూ లేనిది గమనించి దొంగలు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని 7.50 సవర్ల బంగారు ఆభరణాలు, 2.10కేజీల వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. ఈ ఘటన మండలంలోని నరసాపురంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన బొద్దుకూరు శ్రీనివాసులు, ప్రసూన దంపతులు. ఇరువురు ఐదు రోజుల క్రితం బెంగళూరు వెళ్లారు. ఆదివారం ఉదయం తలుపునకు ఎదురుగా తీగపై టవల్ ఆరేసి ఉండడంతో ఇంటి యజమానులు వచ్చి ఉంటారని భావించి పక్కింటి వారు పిలిచారు. ఎవరూ పలకక పోవడంతో ఇంటి వద్దకు వెళ్లి చూడగా తలుపు తాళం పగులగొట్టి ఉంది. తాళం పగులగొట్టే క్రమంలో ఎవరికీ కనిపించకుండా దొంగలు తీగపై టవల్ వేసి ఉంటారని గుర్తించారు. దీంతో ఇంటి యజమానికి ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. బాధితులు బెంగళూరు నుంచే తమ బంధువులకు జరిగిన విషయం చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో ఇంటి పరిసరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న వెంకటయ్య

ఆత్మకూరు: బీసీ సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వై వెంకటయ్య అన్నారు. పట్టణంలోని బీసీ విద్యార్థినుల వసతిగృహాలను ఆదివారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఉన్నత పాఠశాల విద్యార్థినుల వసతిగృహాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం భోజన పదార్థాలను రుచి చూశారు. పదో తరగతి విద్యార్థినులతో సమావేశమై త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సూచనలు చేశారు. పరీక్షలపై ఎలాంటి భయం అవసరంలేదని, ప్రశాంతంగా పరీక్షలు రాసి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పరీక్షలు బాగా రాసేందుకు అవసరమైన మెలకువలను సూచించాలని వార్డెన్లకు తెలిపారు. అనంతరం కళాశాల బాలికల హాస్టల్‌ను పరిశీలించారు. ఇంటర్ పరీక్షలు ఏ విధంగా రాస్తున్నారని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆత్మకూరు ఏఎస్‌డబ్ల్యూఓ చల్లా శ్రీదేవి, హెచ్‌డబ్ల్యూఓలు ఉన్నారు.

ఎన్నికల సమరానికి సిద్ధం



జలదంకి: సిద్ధం సభకు తరలివెళ్తున్న వాహనాలను జెండాఊపి ప్రారంభిస్తున్న ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



వెంకటాచలం: సిద్ధం సభకు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- జిల్లా నుంచి భారీగా తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు
- 8 నియోజకవర్గాల నుంచి వేలాది వాహనాల్లో లక్షలాది మంది శ్రేణులు
- పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలో జరిగిన సిద్ధం సభలో సింహపురివాసుల జగన్ నినాదం మోరుమోగింది. జిల్లా నుంచి లక్షలాది మంది వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు ఉరకలెత్తిన ఉత్సాహంగా సిద్ధం సభకు బయలుదేరి వెళ్లారు. తమ అధినేతను కన్నులారా చూసి ఆయన ఉత్సాహపరిచే ప్రసంగం విని ఎన్నికల సమరానికి సిద్ధమయ్యారు. ఎన్నికల సన్నాహంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సిద్ధం సభకు జిల్లా నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. జిల్లా నలుమూలల నుంచి వేలాది వాహనాల్లో లక్షలాది మంది కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. నెల్లూరు నగరం, రూరల్, ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి, కావలి, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ఏ గ్రామానికి ఆ గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాహనాలను ఏర్పాటు చేసుకుని మరీ సభకు పయనమయ్యారు. ఊహించని విధంగా లక్షలాది మంది కార్యకర్తలు ఒక్కసారిగా తరలడంతో జిల్లాలో పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. మరో నాలుగైదు రోజుల్లో ఎన్నికల నగారా మోగనుంది. ఈ తరుణంలో నిర్వహించిన సభకు హాజరయ్యేందుకు జిల్లా నలుమూలల నుంచి భారీగా జనాలు స్వచ్ఛందంగా తరలిరావడం చూసి మరోసారి జిల్లాలో వైఎస్సార్‌సీపీ హవా నడుస్తోందని, అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ విజయం తథ్యమనే రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కాగా సిద్ధం సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కార్యకర్తలు, నాయకులను ఎన్నికలకు సమాయత్తం చేస్తూ చేసిన ప్రసంగం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధినేత పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ నాలుగేళ్లల్లో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రతిపక్ష పార్టీల కుట్రలను ప్రజలకు వివరించాలని అధినేత పార్టీ కార్యకర్తలకు సూచనలు చేశారు. పేదలకు న్యాయం జరగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం సాధించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. పార్టీ అధినేత ఇచ్చిన ధైర్యంతో పార్టీలో మరింత జోరు నెలకొంది. ఒకపక్క సిద్ధం సభకు లక్షలాది మంది కార్యకర్తలు, అభిమానులు తరలిరావడం, మరోపక్క పార్టీ అధినేత ఇచ్చిన ధైర్యంతో జిల్లాలో పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికలకు మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు ఈ సభ దోహదం చేసిందని పార్టీ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కనుల పండువగా మూలస్థానేశ్వరుడి రథోత్సవం



అశేష భక్తజనం నడుమ మూలస్థానేశ్వరుడి రథోత్సవం, (ఇన్‌సెట్లో) విశేషాలంకారంలో ఆదిదంపతులు

- శివనామస్మరణతో పులకించిన మూలాపేట
- ఆదిదంపతులకు భక్త నీరాజనం

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నగరంలోని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. తొలుత భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి రథ మండపం వద్ద కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను రథంపై కొలువుదీర్చారు. తొలుత బ్రహ్మోత్సవాల ప్రత్యేకాధికారి, జిల్లా దేవదాయ శాఖ అధికారి జే శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, ఈఓ ఆరంబాకం వేణుగోపాల్, పెంచలకోన దేవస్థానం ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, రథోత్సవం ఉభయకర్తలు ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, లత దంపతులు గుమ్మడికాయలు, టెంకాయలు కొట్టి కర్పూరహారతులు ఇచ్చి రథోత్సవాన్ని ప్రారంభించారు. సంప్రదాయంగా తొలుత మూలాపేటలోని అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి చిరు రథం ముందుగా సాగింది. భక్తుల శివన్నామ స్మరణల నడుమ మూడు గంటల పాటు రథోత్సవం ఆద్యంతం ఆనందభరితంగా సాగింది. దేవస్థానం నుంచి ప్రారంభమైన రథోత్సవం బ్రాహ్మణవీధి, ఆర్ఎస్ఆర్ఎం ఉన్నత పాఠశాల, శ్రీపొట్టి శ్రీరాములు బొమ్మ కూడలి, అలంకార్‌సెంటర్, రాజాగారివీధి, రావిచెట్టుసెంటర్ మీదుగా దేవస్థానం చేరింది. భక్తులు విశేషంగా రథోత్సవం పాల్గొన్నారు. రథచక్రాలపై ఉప్పుమిరియాలు విసురుతూ, గుమ్మడి కాయలు, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 127
లేయర్ (లైవ్)	: 73
బ్రాయిలర్ చికెన్	: 224
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 250
లేయర్ చికెన్	: 125



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి: రూ. 85
సన్నవి: రూ. 75
పండ్లు: రూ. 30



కృష్ణపట్నం పోర్టు వద్ద సోమిరెడ్డి హైడ్రామా

- ఆదివారం సెలవని తెలిసీ ఆందోళన
- కంటైనర్ టెర్మినల్ పేరుతో పోర్టులోకి వెళ్లేందుకు యత్నం
- అడ్డుకుని భగ్నం చేసిన పోర్టు సెక్యూరిటీ



పోర్టు సెక్యూరిటీ అధికారికి వేలు చూపుతూ బెదిరిస్తున్న సోమిరెడ్డి

నెల్లూరు: అదాని కృష్ణపట్నంపోర్టులో ఆదివారం అధికారులు ఎవరూ ఉండరు. పోలీసు సిబ్బంది మొత్తం మేదరమెట్ల సిద్ధం సభ విధులకు వెళ్లారు. ఇదే అదనుగా రాజకీయ మైలేజీ సాధించవచ్చని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తలపెట్టిన కుట్ర భగ్నమైంది. కంటైనర్ టెర్మినల్ పరిరక్షణ సాకుతో చేసిన హైడ్రామా నవ్వులపాలైంది. కృష్ణపట్నంపోర్టు కంటైనర్ టెర్మినల్ పరిరక్షణ పేరుతో సోమిరెడ్డి ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలను వెంటేసుకుని పోర్టు వద్దకు ప్రదర్శనగా వచ్చారు. కొంతమందిని ముందుంచి గోపాలపురం వద్దకు చేరుకున్నారు. పోర్టులోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పోర్టులో ఉన్నతాధికారులు ఎవ్వరూ లేరని, ముందస్తు సమాచారం లేకుండా, వారి అనుమతి లేకుండా లోపలకు వెళ్లనిచ్చేది లేదని సెక్యూరిటీ అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో సోమిరెడ్డి వర్గీయులు రెచ్చిపోగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. టీడీపీ శ్రేణులు పోర్టు సెక్యూరిటీపై విరుచుకుపడడంతో తోపులాట జరిగింది. కొద్దిసేపు గందరగోళం నెలకొంది. సెలవు రోజు ఆందోళన చేయడం ఏమిటంటూ సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నిస్తూ వారి హైడ్రామాను భగ్నం చేశారు. దీంతో సోమిరెడ్డి చేసేది లేక పోర్టు సీఈఓ జీజే రావుకు ఫోన్ చేశారు. ఇచ్చిన గడువు ప్రకారం కంటైనర్ టెర్మినల్‌ను చూసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అయితే కంటైనర్ టెర్మినల్‌కు వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని, ఆదివారం కనుక తనతో పాటు అధికారులు ఎవరూ ఉండరని, పరిశీలనకు మరో మారు రావాలని సీఈఓ బదులు ఇచ్చారు. దీంతో ఎటూ పాలుపోని సోమిరెడ్డి తన కార్యకర్తలతో కొద్ది దూరం నడిచి, మీడియా ఎదుట అధికార పార్టీ నేతలపై ఆరోపణలు చేసి వెనుదిరిగారు.

రాష్ట్రానికి బీజేపీ తీరని ద్రోహం

- బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తును ప్రజలు ఆమోదించరు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తును రాష్ట్ర ప్రజలు ఆమోదించరని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. బాలాజీనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ వల్ల రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాలేదని, పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కాలేదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను సైతం మోదీకు టీడీపీ ఫణంగా పెట్టిందని ఆరోపించారు. ఏ ఒక్క రోజు విశాఖ ఉక్కు పరిరక్షణ గురించి చంద్రబాబు మాట్లాడలేదన్నారు. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ రాష్ట్రంలో హిందువులపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారన్నారు. హిందువులపై రాష్ట్రంలో ఎక్కడ దాడులు జరిగాయో చెప్పాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాభివృద్ధిని పక్కన పెట్టి మతాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌తో కలిసి సీపీఐ, సీపీఎంలు పోరాటాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మరో మూడు రోజుల్లో జిల్లాలో సీపీఎం పోటీ చేసే స్థానాలను ప్రకటిస్తామన్నారు. నెల్లూరు నగర నియోజకవర్గంలో కచ్చితంగా సీపీఎం బరిలో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు

- సెమీ ఫైనల్స్‌కు చేరిన నాలుగు జిల్లాల జట్లు



తలపడుతున్న కబడ్డీ జట్లు

కోవూరు: మండలంలోని పడుగుపాడు పంచాయతీ నేతాజీనగర్‌లోని వైకేఆర్అండ్‌కే డిగ్రీ కళాశాలలోని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి క్రీడా ప్రాంగణంలో మూడ్రోజుల పాటు నిర్వహిస్తున్న 70వ అంతర్ జిల్లాల పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు పోటా పోటీగా సాగుతున్నాయి. రెండోరోజు శనివారం రాత్రి జరిగిన పోటీల్లో నెల్లూరు, కృష్ణా, విజయనగరం, చిత్తూరు జట్లు రాణించి సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ మాజీ కార్యదర్శులు వీర్ల వెంకయ్య, కేపీ రావు, మాజీ జాయింట్ సెక్రటరీలు టీ రామచంద్ర, శ్రీనివాసరావు, ఎస్. రాంబాబు, ఇండియన్ టీం మేజర్ కోచ్ ఎం ఉమాశంకర్‌బాబు, తదితరులు హాజరై తిలకించారు. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పద్మజబాల, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి లవకుమార్, ఉపాధ్యక్షుడు పీ జాన్సన్, కార్యదర్శి విజయానంద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గురుకులం పిలుస్తోంది

- 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 31 వరకు దరఖాస్తు గడువు
- ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష

నెల్లూరు (వేదాయపాళెం): చదువుకోవాలనే ఆసక్తి కలిగిన విద్యార్థులను గురుకులం రా..రమ్మని పిలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు దరఖాస్తులను కోరుతోంది. మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలోని బీసీ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గురుకుల ప్రవేశాలకు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి సీటు పొందితే ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా వసతి సౌకర్యంతో పాటు చదువుకునే అవకాశం లభిస్తుంది. ఆంగ్ల మాధ్యమంలో బోధనతో పాటు నీట్, ఐఐటీలకు ఉచితంగా శిక్షణ ఇస్తారు. విద్యార్థులు ఏప్రిల్ 27న నిర్వహించే కామన్ టాలెంట్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ప్రతిభ చూపి ప్రవేశాలు పొందొచ్చు.

అర్హతలు ఇవీ..

ఓసీ, బీసీ, కన్వర్టెడ్ క్రిస్టియన్ (బీసీసీ) విద్యార్థులు 1.09.2013 నుంచి 31.08.2015 మధ్యన జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1.9.2010 నుంచి నుంచి 31.08.2015 మధ్యన జన్మించి ఉండాలి. సంబంధిత జిల్లాలో 2022–23, 2023–24 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3, 4 తరగతులు చదివి ఉండాలి. తల్లిదండ్రులు, సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించి ఉండరాదు.

దరఖాస్తు విధానం..

విద్యార్థులుhttps://mjpapbc wris.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు రుసుం రూ.100 ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి.

గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు

బీసీ గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నాం. 2024–2025 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. పేద, మధ్య తరగతి విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. –డీ కొండలరావు, జిల్లా కన్వీనర్, బీసీ గురుకుల పాఠశాలలు

సీట్ల కేటాయింపు ఇలా...

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో దొరవారిసత్రంలో బాలురు 80, కోటలో బాలురు 120, గొలగమూడిలో మత్స్యకార బాలికలు 80, గూడూరులో బాలికలు 40, నార్త్ ఆములూరులో బాలికలు 40, మహ్మదాపురం, వెంకటాచలంలో బాలురు 40, ఆత్మకూరులో బాలికలు 40 సీట్లు కలవు. ప్రవేశ పరీక్ష మెరిట్ ఆధారంగా ఆయా గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు.